epaper:vishalabharati.com

# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

గురువారం, హైదరాబాద్ 15.05.2025 | 24 క్యారెట్లు 89,980 | కిలో వెండి 1,15010 | 34 °C | సంపుటి:3 | సంచిక:194

www.vishalabharati.com

## ఉత్తరప్రదేశ్‌లో మరో సెమీ కండక్టర్
# యూనిట్ ఏర్పాటు

- కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- దీని ద్వారా 2 వేల మందికిపైగా ఉపాధి
- సెమీ కండక్టర్ల యూనిట్‌లో నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మన దేశంలో సెమీ కండక్టర్ల రంగాన్ని మరింత ప్రోత్సహించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్‌లో రూ.3,706 కోట్లతో 6వ సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. దీని ద్వారా రెండు వేల మందికిపైగా ఉపాధి లభించనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. సెమీ కండక్టర్ల యూనిట్‌లో నెలకు 3.6 కోట్ల చిప్‌ల

..మిగతా 2 లో



# చీరకట్టులో మిస్ వరల్డ్

## ముద్దుగుమ్మలు రామప్ప, వేయిస్తంభాల సందర్శన

- నృత్య ప్రదర్శనలతో ఘనస్వాగతం
- రామప్ప శిల్పాల హోయలకు ముగ్దులయ్యారు.
- నిర్మాణ నైపుణ్యానికి ఆశ్చర్యం
- నీటిలో తేలియాడే ఇటుకలను స్వయంగా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు
- ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు
- చెవిలో తమ కోరికలు చెప్పుకున్న సుందరీమణులు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాకతీయుల కళా వైభవానికి ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా అయ్యారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా ఓరుగల్లుకు చేరుకున్న అందాల భామలు రామప్ప, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. చూపుతిప్పనివ్వని రామప్ప శిల్పాల హోయలకు ముగ్దులయ్యారు. వేయి స్తంభాల ఆలయమంతా కలియ తిరిగిన సుందరీమణులు నిర్మాణ నైపుణ్యానికి ఆశ్చర్యపోయారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ముద్దుగుమ్మలు ఇరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ జరూర్ ఆనా" పేరుతో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. పర్యాటకుల స్వర్గధామంగా పిలుచుకునే ఓరుగల్లు వైభవాన్ని ప్రపంచ సుందరీమణులు ఆస్వాదిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా 57 మంది ముద్దుగుమ్మలు వరంగల్‌కు చేరుకున్నారు. హనుమకొండ లోని

..మిగతా 2 లో



## ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్
# కొత్త నిర్వచనం

- పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'
- రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల భేటీ
- ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాల వివరణ


**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు బుధవారం నాడు భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను రాష్ట్రపతికి వీరు వివరించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆర్మీ ఉన్నతాధికారులు తనను కలిసిన ఫోటోను రాష్ట్రపతి ముర్ము షేర్ చేశారు. సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తనను కలుసుకున్నారని ఈ పోస్ట్‌లో రాష్ట్రపతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను తెలియజేశారని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు పోరాడిన

..మిగతా 2 లో

## నేటి నుంచే కాళేశ్వరం
# సరస్వతి పుష్కరాలు

- ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్నాయి
- వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం
- మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- పుష్కరాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు



3 లో



# బీజేపీ మంత్రి కున్వర్‌పై కేసు నమోదు

- కల్నల్ ఖురేషిపై మంత్రికి హైకోర్టు షాక్
- మధ్యప్రదేశ్ కున్వర్ విజయ్ పై కేసు
- మతం పేరుతో ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించొద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కల్నల్ సోఫియా ఖురేషి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కున్వర్ విజయ్ షాకు ఆ రాష్ట్ర హైకోర్టు బుధవారం నాడు షాక్ ఇచ్చింది. మంత్రిపై సాయంత్రంలోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డీజీపీని ఆదేశించింది. ఎఫ్ఐఆర్

..మిగతా 2 లో

## మార్చి 31 నాటికి నక్సలిజం
# అంతమవుతుంది

- ఇదే మా ప్రతిజ్ఞ
- కర్రెగుట్ట నక్సల్స్ ఆపరేషన్
- 21రోజుల్లో 21 ఎన్కౌంటర్లు
- 31మంది మావోయిస్టులు మృతి
- కర్రెగుట్టలో 214 బంగర్లు గుర్తించి ధ్వంసం చేశాం
- 12 వేల కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నాం
- ఛత్తీస్ ఘఢ్ డీజీపీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఛత్తీస్ ఘఢ్ తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టలో జరిగి భారీ నక్సల్ ఆపరేషన్లో మావోయిస్టులకు భారీగానే ఎదురుదెబ్బ తగిలింది. ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన ఆపరేషన్లో భద్రతా దళాలు 31మంది నక్సలైట్లను హతమార్చినట్లు ఛత్తీస్ ఘఢ్ పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. బుధవారం బీజాపూర్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్కు సంబంధించిన విషయాలు

..మిగతా 3 లో



2 లో

## సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్
# ప్రమాణ స్వీకారం

**రాష్ట్రపతి ఆయనతో ప్రమాణం చేయించారు**

## జూన్ 2న రాజీవ్ యువ వికాసం
# మంజూరు పత్రాలు పంపిణీ

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- లక్షల కోట్ల అప్పులోను సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- బీఆర్ఎస్ ఇళ్ల పేరిట 10 ఏళ్లు మోసం



2 లో

## మూడేళ్లలో కుప్పకూలిన
# ప్రాజెక్టు కాళేశ్వరమే

- ఇలా భూ ప్రపంచంలో మరెక్కడా లేదు
- ప్రాజెక్టు ఎలా కట్ట కూడదో కాళేశ్వరంను చూసి తెల్సుకోవాలి.
- సీఎం రేవంత్ రెడ్డి




2 లో

# భారత అమ్ములపొదిలో భార్గవాస్త్ర

## పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన

- ఆపరేషన్ సిందూర్ తో పాక్‌ను కాళ్ల బేరానికి
- 2.5 కిలోమీటర్ల దూర శత్రు డ్రోన్లను గుర్తించి తిరిగి అంతం చేయగలదు
- టెస్ట్ ఫైర్ సూపర్ సక్సెస్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారత అమ్ములపొదిలో మరో దివ్యాస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మైక్రో రాకెట్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఆపరేషన్ సిందూర్తో పాక్ను కాళ్ల బేరానికి తీసుకొచ్చిన భారత్

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
15.05.2025
గురువారం,
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# భారత అమ్ములపొదిలో భార్గవాస్త్ర

**తరువాయి భాగం**

, ఇప్పుడు శత్రు డ్రోన్లను ధ్వంసం చేసే సరి కొత్త అస్త్రాన్ని తన అమ్ములపొదిలో చేర్చుకుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ ఆధునిక యుద్ధ రంగంలో డ్రోన్ల పాత్ర చాలా కీలకంగా మారింది. రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధంలో ఇరుదేశాలు వేలాది డ్రోన్లను ప్రయోగించుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియేకు చెందిన వందలాది డ్రోన్లను భారత్ నగరాలే లక్ష్యంగా పాకిస్తాన్ ప్రయోగించింది. ఐతే మన గగనతల రక్షణ వ్యవస్థ వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. దేశ భద్రతకు ఈ డ్రోన్లు సవాళ్లుగా మారుతున్నాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి ముప్పులు ఎదురైతే శత్రు డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసేందుకు భారత్ సర్వసన్నద్ధమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తక్కువ ఖర్చులోనే కౌంటర్ డ్రోన్ వ్యవస్థ భార్గవాస్త్రను సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేసింది.

ఒడిశా గోపాల్‌పుర్‌లో ఉన్న సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో భార్గవాస్త్ర మైక్రో రాకెట్ వ్యవస్థను పరీక్షించగా, అన్ని లక్ష్యాలను విజయవంతగా ఛేదించినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దీనికి మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించారు. రెండు ట్రయల్‌స్‌లో ఒక్కో రాకెట్ చొప్పున పెట్టి పరీక్షించారు. మూడో దశలో రెండు రాకెట్లను ఒకేసారి 2 సెకన్ల వ్యవధిలో పేల్చి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ భార్గవాస్త్రను పూర్తి స్వదేశీ సామర్థ్యంతో అభివృద్ధి చేశారు. 2.5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న శత్రు డ్రోన్లను గుర్తించి ఇది మైక్రో రాకెట్ల సాయంతో నిర్వీర్యం చేయగలదు. ఇందులోని రాడార్ వ్యవస్థ గగనతలంలో 6 నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ముప్పులను కూడా పసిగట్టగలదు. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లను పెట్టి 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనం చేసేలా దీన్ని రూపొందించారు. ఇక, రెండో లేయర్‌లో గైడెడ్ మైక్రో మిసైల్‌ను ఉంచుతారు. ఇవి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. సముద్రానికి 5000 మీటర్ల ఎత్తులో ఉండే భూభాగాల్లో, కొండల ప్రాంతాల్లోనూ వీటిని సమర్థంగా ఉపయోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది.

## ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్
# కొత్త నిర్వచనం

**తరువాయి భాగం**

తీరును రాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది చోట్ల ఉగ్రశిబిరాలపై భారత త్రివిధ దళాల బలగాలు విరుచుకు పడ్డాయి. ఈ దాడుల్లో ఉగ్రశిబిరాలు నేలమట్టం కావడంతోపాటు 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఇందుకు బదులుగా భారత మిలటరీ, సివిలియన్ ఏరియాల్లో పాక్ దాడులకు దిగడంతో భారత్ సమర్థవంతంగా వాటిని తిప్పికొట్టింది. 11 పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లపై కీలక దాడులు జరిపింది. దీంతో కాళ్లబేరానికొచ్చిన పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన చేయడంతో అందుకు భారత్ అంగీకరించింది. ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్ కొత్త నిర్వచనం ఇచ్చిందని, టెర్రరిజం మూలాలు ఎక్కడున్నా భీకరంగా దాడులు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. పాక్ న్యూక్లియర్ బ్లాక్‌మెయిల్‌కు లొంగే ప్రసక్తే లేదని, ఉగ్రశిబిరాలను సమూలంగా నాశనం చేస్తామన్నారు. టెర్రరిజం, టెర్రరిజం వెనక ఉన్న ప్రధాన సూత్రధారులను వేర్వేరుగా చూడమన్నారు. భారత్‌ను, దేశ ప్రజలను పరిరక్షించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటామని ప్రధాని స్పష్టం చేశారు.

## జూన్ 2న రాజీవ్ యువ వికాసం
# మంజూరు పత్రాలు పంపిణీ

- ఎర్రుపాలెంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం శంకుస్థాపన
- ప్రజా ప్రభుత్వంలో ఇంటింటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూన్ 2న రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని, తమ పాలకులు పదేళ్లపాటు ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేశారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గం, ఎర్రుపాలెం మండల కేంద్రంలో బుధవారం 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటింటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద చేసిన ఖర్చు వివరాలను లెక్కలతో సహా త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన లబ్ధి వివరాలను తయారుచేసి వివరాలు కూడా వెల్లడిస్తామని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం ఇలా ప్రతి ఇంటికీ వేలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆ వివరాలను పూర్తిగా త్వరలో బహిర్గతం చేస్తామని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పదేళ్లు పాలించిన వారు రాష్ట్రాన్ని గాలికి వదిలేసి, 7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారని మండిపడ్డారు. ఆదాయం లేకపోయినా, అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ మొదటి ఏడాదిలోనే పెద్ద సంఖ్యలో ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని అన్నారు. అటవీ హక్కు చట్టం ద్వారా పట్టా పొందిన రైతులందరికీ ఇందిరా గిరి జలవికాసం ద్వారా ఉచితంగా బోర్లు, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్, పామాయిల్, అవకాడో మొక్కలు ఉచితంగా అందజేస్తామని అన్నారు. జూన్ 2న రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 34 మంది కళ్యాణలక్ష్మి పథక లబ్ధిదారులకు రూ. 34,03,944 విలువ గల చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్,వైరా ఎంఎల్ఎ మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ శ్రీనివాసాచారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతిబాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఆర్‌డిఒ జి. నర్సింహారావు, డిసిసి అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పిఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఏడిఏ విజయ్ చందర్, తహశీల్దార్లు ఉషా శారద, పున్నం చందర్, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కర్రెగుట్టలో 31 మంది మావోయిస్టుల హతం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి. ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా చేపట్టిన ఆపరేషన్‌లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం ప్రకటించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను బుధవారం బీజాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు.సుమారు 21 రోజుల పాటు సాగిన ఈ కీలక ఆపరేషన్‌లో మృతి చెందిన 31 మంది మావోయిస్టులలో 16 మంది మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు. హతమైన మావోయిస్టులపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.1.72 కోట్ల రివార్డును ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ ఎదురుకాల్పులు, ఆపరేషన్ క్రమంలో 18 మంది భద్రతా సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు.

# మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు కాళేశ్వరమే

- కేసీఆర్ హెలికాప్టర్లో పోతూ ఎక్కడ ప్రాజెక్టు కట్టాలో చెప్పారట
- భావోద్వేగంతో గత పార్టీలు రాజకీయ లబ్ది పొందాయి
- జలసౌధలో కొలువుల పండుగ
- త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం
- నీటిపారుదల శాఖ AE, JTO లకు నియామక పత్రాలు అందజేత



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నీళ్ల అవసరమే తెలంగాణను సాధించిందన్న రేవంత్.. గతంలో తెలంగాణ ఉద్యమాన్ని భావోద్వేగంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందారన్నారు. అనేక విషయాలపై ముక్కుసూటిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి అనేక విషయాలపై సమగ్రంగా వివరించారు. విపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు సెటైర్లు వేస్తూ ముప్పేట దాడి చేశారు. అటు ఉద్యోగుల గురించి కూడా సీఎం రేవంత్ కుండబద్ధలు కొట్టారు. "ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి. నాయకులు చెప్పారని చేస్తే అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. అప్పటి సీఎం హెలికాప్టర్లో వెళుతూ ఎక్కడ ప్రాజెక్టు కట్టాలో చెప్పారట. విజిలెన్స్ NDSA నివేదికల్లో అధికారులను ఉరితీయాలని చెప్పారు."

"ప్రాజెక్టు ఎలా కట్ట కూడదో కాళేశ్వరంను చూసి తెల్సుకోవాలి. ఎలా నిర్మించాలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను చూసి నేర్చుకోవాలి. కొందరు కోర్టులో కేసులు వేసి ఉద్యోగ నియామకాలు అడ్డుకుంటున్నారు. గ్రూప్ వన్ పరీక్షలకు ఏర్పాట్లు అన్ని పూర్తి అయ్యాయి. కానీ కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. నీళ్లు మన నాగరికత.. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టింది. నీళ్ల కోసం మొదలైన మన ఆకాంక్షనే రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం.. ఆ భావోద్వేగానికి మీరే ప్రతినిధులు. భావోద్వేగంతో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాయి." అని సీఎం రేవంత్ అన్నారు. రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టినా తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు. గతంలో కట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ కాళేశ్వరం మూడేళ్ళలోనే కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయి. ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇది. త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం" అని సీఎం రేవంత్ అన్నారు. జలసౌధలో కొలువుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు. హాజరయ్యారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన AE, JTO లకు సీఎం ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న మీ అందరికీ అభినందనలు. అని సీఎం కొత్త ఉద్యోగులను సాదరంగా ఆహ్వానించారు.

# చీరకట్టులో మిస్ వరల్డ్

**తరువాయి భాగం**

హరిత హోటల్‌లో దిగిన అందగత్తెలకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మహిళలు బతుకమ్మలు, మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీదారుల్లోని ఓ బృందం ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శించింది. గిరిజన సంప్రదాయ కొమ్మకోయ నృత్యాల ప్రదర్శనలతో అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. చీరకట్టులో ఆలయానికి వచ్చిన ముద్దుగుమ్మల హోయలొలికే రామప్ప శిల్ప సౌందర్యానికి ముగ్దులయ్యారు. శతాబ్దాలు దాటినా చెక్కుచెదరకుండా సాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మితమైన రామప్ప ఆలయ ప్రత్యేకతను తెలుసుకున్నారు. నీటిలో తేలియాడే ఇటుకలను స్వయంగా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మరో బృందం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించింది. ఆలయం ముందున్న నంది వద్ద అందరూ కలిసి ఫోటోషూట్ నిర్వహించారు. నంది చెవిలో తమ కోరికలు చెప్పుకున్న సుందరీమణులు వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాకతీయుల కళా వైభవంతో పాటు పేరిణి, గుస్సాడీ, కూచిపూడి నృత్యాలను మిస్‌వరల్డ్ పోటీదారులు తిలకిస్తున్నారు. కళ్లు చెదిరే లేజర్ షో, లైటింగ్ షోలను వీక్షించనున్నారు. అనంతరం హరిత హోటల్‌లో చేయి తిరిగిన చెఫ్‌లు చేసిన తెలంగాణ ప్రత్యేక వంటకాలను ఆస్వాదించనున్నారు. సుందరాంగుల పర్యటన దృష్ట్యా పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు.



# బీజేపీ మంత్రి కున్వర్‌పై కేసు నమోదు

**తరువాయి భాగం**

నమోదు చేయడంలో విఫలమైతే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.తమకు మరింత సమయం ఇవ్వాలని ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అందుకు జస్టిస్ అతుల్ శ్రీధరన్ నిరాకరించారు. ''ఈ అంశం అర్జెన్సీని గుర్తించుకోండి.. రేపటికి నేను ఉంటానని గ్యారెంటీ ఏదైనా ఉందా'' అని ప్రశ్నించారు. మతం పేరుతో ఇరువర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించరాదనే భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 196కు ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేస్తూ వచ్చిన కల్నల్ ఖురేషిపై విజయ్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఖురేషిని ''ఉగ్రవాదుల చెల్లెలు'' అంటూ మంత్రి సంబోధించారంటూ కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. అందుకు సంబంధించి వీడియో క్లిప్‌ను కూడా షేర్ చేసింది. ''ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచి వేస్తే.. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని పంపించి గట్టి గుణపాఠం చెప్పాం'' అని మంత్రి వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సైతం తీవ్రంగా ఖండించింది.

# ఉత్తరప్రదేశ్‌లో మరో సెమీ కండక్టర్
# యూనిట్ ఏర్పాటు

**తరువాయి భాగం**

ఉత్పత్తి జరుగుతుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. అంతేకాకుండా 270 వర్సిటీల్లో విద్యార్థులకు సెమీ కండక్టర్ల సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సెమీ కండక్టర్ల సాంకేతికతపై 70 స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. అంతేకాదు పరిశ్రమల అవసరాల మేరకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కొత్త విద్యా విధానం ద్వారా అకడమిక్ విద్యను, పరిశ్రమలను అనుసంధానం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. టెలికామ్ విభాగం కోసం యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్‌లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇన్‌క్యూబేటర్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. సెమీకండక్టర్ల పరికరాలు కూడా భారత్‌లో తయారీకి కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**నెలకు 3.6 కోట్ల చిప్ల తయారీ**

యూపీలోని జెవార్ విమానాశ్రయానికి సమీపంలో హెచ్‌సీఎల్, ఫాక్స్కాన్ల జాయింట్ వెంచర్గా ఈ సెమీకండక్టర్ యూనిట్ను ఏర్పాటు చేయనున్నాయి. 2027లో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. హార్డ్వేర్ అభివృద్ధి, తయారీలో హెచ్సీఎల్కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో ఫాక్స్కాన్కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ రెండూ కలిసి యమునా ఎక్స్ప్రెస్వే ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అథారిటీ (YEIDA)లోని జెవార్ విమానాశ్రయం సమీపంలో సెమీకండక్టర్ ప్లాంట్ను ఏర్పాటు చేస్తాయి'ఈ యూనిట్ నెలకు 20,000 వేఫర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది నెలకు 36 మిలియన్ల (3.6 కోట్ల) చిప్లను తయారు చేయగలుగుతుంది' అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ జెవార్ ప్లాంట్లో ఉత్పత్తి చేసిన చిప్లను మొబైల్ ఫోన్స్, ల్యాప్టాప్స్, ఆటోమొబైల్స్, పీసీలు మొదలైన వాటిలో ఉపయోగిస్తారు.

**ఇంకా ప్రారంభ దశలోనే!**

వాస్తవానికి భారత్లో సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉంది. దీనిని ఇంకా విస్తరించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ సమయంలో చిప్ల కొరత ఏర్పడింది. దీనితో జాతీయ భద్రత సహా, స్వదేశీ ఆవిష్కరణల కోసం దేశీయంగా సెమీకండక్టర్ల తయారీ ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ లోటును పూడ్చడానికి కృషి చేస్తోంది.

# సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డుల కెక్కారు.

జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదులతో కలిసి పనిచేశారు. అనతికాలంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఆయన మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ఉన్నారు. నాగ్పుర్ బెంచ్లో కెరీర్ ప్రారంభించిన ఆయన తన పట్టుదలతో సీజేఐ దాకా ఎదిగారు.2000లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఆ తరువాత నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ ప్లీడర్ అయ్యారు. 2003లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2005లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఇప్పుడు 14 మే 2025న భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పదవీ కాలం 2025 నవంబర్ 23వరకు ఉంటుంది. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ గవాయ్ ఆరేళ్లలోనే సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. సంచలన కేసుల తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ప్రముఖ రాజకీయ నాయకుడు, బిహార్, కేరళ గవర్నర్ ఆర్ఎస్ గవాయ్ కుమారుడే సీజేఐ జస్టిస్ గవాయ్. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ అంబేద్కర్ వాది. అలాగే, పార్లమెంట్ సభ్యులుగా కూడా పనిచేశారు. ఈ క్రమంలో తన తండ్రిలాగే రాజకీయాల్లోకి వస్తారా? అని అడిగినప్పుడు జస్టిస్ గవాయ్ ఆసక్తికర సమాధానం చెప్పారు. రాజకీయాలపై ఆసక్తి లేదని చెప్పారు. పదవీ విరమణ తర్వాత ఎలాంటి బాధ్యతలను తాను తీసుకోవాలనుకోవడం లేదని పేర్కొన్నారు. ఇతర పదవులన్నీ కూడా సీజేఐ కంటే తక్కువే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆఖరికి గవర్నర్ పదవికి కూడా సీజేఐ కంటే తక్కువే చెప్పుకొచ్చారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

15.05.2025
గురువారం,
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# మార్చి 31 నాటికి నక్సలిజం అంతమవుతుంది

తరువాయి భాగం



వెల్లడించారు. ఈ సమావేశంలో సీఆర్పీఎఫ్ డీజీ, ఛత్తీస్గఢ్ డీజీపీ పాల్గొన్నారు.

**21 ఎన్కౌంటర్లు**

'కర్రెగుట్ట కొండలు చుట్టూ ఏప్రిల్ 21న ఆపరేషన్ కగార్ పేరుతో దీనిని ప్రారంభించాం. దాదాపు 21 రోజులు పాటు జరిగిన భారీ ఆపరేషన్లో దాదాపు 20,000మంది సిబ్బంది పాల్గొన్నారు. ఛత్తీస్గఢ్ పోలీసులు, సీఆపీఎఫ్ సిబ్బంది ఉన్నారు. మే 11న ఆపరేషన్ను విరమించుకున్నాం. ఈ భారీ ఆపరేషన్లో మొత్తం 21 ఎన్కౌంటర్లు జరిగాయి. 16మంది మహిళ కేడర్తో సహా 31మంది మావోయిస్టులు మరణించారు. వారి నుంచి SLR, INSAS, ఇతర ఆటోమేటిక్, సెమీ ఆటోమేటిక్ సహా 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం' అని ఛత్తీస్గఢ్ డీజీపీ అరుణ్ దేవ్గౌతమ్ తెలిపారు.

**'భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం'**

ఇక మృతుల్లో 28మందిని గుర్తించినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. వారిలో రూ. 1.75 కోట్ల రివార్డ ఉన్న మావోయిస్టు కూడా చనిపోయినట్లు తెలిపారు. ' కర్రెగుట్టలో 214 బంగర్లు గుర్తించి ధ్వంసం చేశాం. 450 ఐఈడీలు, 818 బారెల్ గ్రెనేడ్ లాంచర్ల షెల్స్, 899 కార్డెక్స్ డిటోనేటర్లు, భారీ మొత్తం పేలుడు పదార్థలను స్వాధీనం చేసుకున్నాం. అంతే కాకుండా దాదాపు 12,000 కిలోల ఆహార పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నాం. దేశంలోని 6 జిల్లాలు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో ఛత్తీస్గఢ్లో నాలుగు, మహారాష్ట్ర, ఝార్ఖండ్లో ఒక్కొక్కటి ఉన్నాయి. ఛత్తీస్గఢ్లో సుక్మా, బీజాపూర్, నారాయణపూర్, కాంకేర్ జిల్లాలు నక్సల్స్ ప్రభావిత జిల్లాలు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజం పూర్తిగా అంతమవుతుంది. నక్సలిజాన్ని ఎలాగైనా నిర్మూలించాలి. ఇదే మా ప్రతిజ్ఞ. ఇక ఈ ప్రాంతంలో మా కదలికను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. పూర్వం, ప్రజలు ఆలయంలో పూజలు చేయడానికి ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడ నక్సలైట్ శిబిరాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈ కార్యకలాపాలు ఆగిపోయాయి. మేం దాన్ని మళ్లీ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని డీజీపీ తెలిపారు.

## రైతులను మోసం చేసిన వారిపై పీడీ చట్టం అమలు



నారాయణపేట, విశాలభారతి:

జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ రైతులకు ఎవరైనా,ఎక్కడైన జిల్లా మొత్తంలో నకిలీ విత్తనాలు,ఎరువులు గానీ అమ్మితే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. విత్తనాలు లేదా ఎరువులు కొనే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని,గుర్తింపు ఉన్నవి,ప్యాకింగ్,లేబుల్ మరియు తయారీ తేదీ చూసి,గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు.రైతు దేశానికే వెన్నెముక కాబట్టి అలాంటి రైతులను మోసం చేసిన వారిపై పీడీ చట్టం ప్రయోగించి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సరస్వతీ పుష్కరాలు - సర్వం సిద్ధం!






భారతీయ సనాతన హైందవ సాంప్రదాయాలలో పుష్కర స్నానం ఒక అచంచలమైన గొప్ప భక్తి విశ్వాసం ఉన్నది. ప్రాణకోటి మనగడకు ఆధారమైన జలాన్ని ఆరాధించడం ఓ మోక్ష ప్రదాయమని శాస్త్ర పరమైన నమ్మకం. అందుకే జీవరాశులన్నింటికీ జలం యొక్క ప్రాముఖ్యత తెలపడానికి ప్రతి సంవత్సరం ఒక్కొక్క నదికి పుష్కరం వస్తుంది. భారతదేశంలోని 12 నదుల్లోనూ గురుడు మేశం నుండి మీన రాశి వరకు పన్నెండు రాశులలో ఒక్కొక్క రాశి లోకి ప్రవేశించినప్పుడు ఆయా నదులకు పుష్కరాలు వస్తాయి. గురుడు మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి. రెండు జీవనదులు కలిసిన చోట సరస్వతి నది ఉద్భవించునని కాళేశ్వర ఖండములో స్పష్టం చేయబడింది. 15.05.2025 రోజున కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కరాలు ప్రారంభం అవుతాయి. తేదీ 15.05.2025 నుండి 26.05.2025 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహించబడును. ఇందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నాయకత్వంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఇందుకోసం స్థానిక నాయకత్వం, అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పలుమార్లు సరస్వతీ పుష్కరాలు విజయవంతం చేసేందుకు రివ్యూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదుర్కొకోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్ ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు.

**సరస్వతి నది పుష్కర యాత్ర ఫలం**

మాతృవంశం వారికి పిండ ప్రదానం చేయడం సరస్వతి పుష్కరయాత్ర ఫలంగా చెబుతారు. అందుకే దాన్ని మాతృగయ అని కూడా అంటారు. సరస్వతి నది అతి పురాతనమైనది. హిమాలయాల్లో పుట్టిన ఈ నది ప్రశస్తి ఋుగ్వేదంలోనూ, భాగవతాధి పురాణాల్లోనూ, రామాయణ, మహాభారతంలోనూ కనిపిస్తుంది. బ్రహ్మ శిరస్సు నుండి ఉద్భవించినదిగా చెప్పుకునే ఈ సరస్వతి నది కొంతదూరం ప్రవహించి ఎడారి ప్రాంతమైన రాజస్థాన్ లో అదృశ్యమవుతుంది. గంగా, యమునా నదులతో అంతరవాహినిగా ప్రయాగ వద్ద కలిసి ప్రవహించడం వలన ప్రయాగను త్రివేణి సంగమం అని అంటారు. అలాగే గోదావరి, ప్రాణహిత నదులలో కలిసి అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్నందున కాళేశ్వరం కూడా త్రివేణి సంగమంగా ప్రఖ్యాతి చెందినది. అందువలన కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో పవిత్ర సరస్వతీ పుష్కరస్థానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోవునని శాస్త్రములు చెబుచున్నవి.

మానవులు తెలిసి తెలియక పుట్టినప్పటి నుండి చేసిన పాపములు పుష్కర స్నానంతో తొలగిపోవునని విశ్వాసం కలదు. ఈ నమ్మకంతోనే ఒక్కొక్క సంవత్సరం ఒక్కోనదికి వచ్చే పుష్కరాలకు వెళ్లి పుష్కర స్నానం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని హైందవ సాంప్రదాయం. భారతీయ సనాతన సాంప్రదాయాలలో పుష్కర స్నానం ఒక గొప్ప భక్తి భావం, కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కర స్నానం చేసిన పిదప శ్రీ మహా సరస్వతి అమ్మవారిని దర్శించుట వలన చాలా పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహించుచున్నందున కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో తేదీ 15.05.2025 నుండి 26.05.2025 వరకు "12" రోజులు సరస్వతి నది పుష్కరాలు నిర్వహించబడుచున్నవి. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి దినము



సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయుట, పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్ల దర్శనం చేసుకుంటారు. సరస్వతి నది పుష్కరాల సందర్భంగా వచ్చు భక్తులకు కొరకు నూతన ఘాట్ నిర్మాణం, స్నానాల కొరకు షవర్లు ఏర్పాటు, టెంట్లు, చలువ పందిర్లు, లైటింగ్, ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంకులు నిర్మించి త్రాగు నీటి ఏర్పాటు, అదనపు కౌంటర్లు నిర్మాణం, సిమెంట్ రోడ్ల నిర్మాణం, పిండ ప్రధాన మండపం, కేశఖండన మండపం నిర్మాణం, శాశ్వత మారుగుదొడ్లు, స్నానం గదుల నిర్మాణం, పుష్కర ఘాట్ పైన సరస్వతి అమ్మవారి రాతి విగ్రహం ఏర్పాటు, మేన్ ఘాట్ వద్ద స్వాగత తోరణం నిర్మాణం, హారతి ప్లాట్ ఫారం నిర్మాణం, గోదావరి నదిలో నీటివరకు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు ఏర్పాట్లు చేయుటకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. దేవాలయము వద్ద ప్రత్యేక హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాల కొరకు ఏర్పాట్లు చేయడం జరిగింది. అలాగే త్రివేణి సంగమం వద్ద పుష్కరాలు జరిగే పన్నెండు రోజులు సరస్వతి ఘాట్ పైన ప్రత్యేక హారతి కార్యక్రమం నిర్వహిచడం జరుగుతుంది. పుష్కర పనులు అన్నీ ప్రారంభమై చురుగ్గా జరుగుచున్నాయి. జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాగం మొత్తం పుష్కర ఏర్పాట్ల పనులలో నిమగ్నమై ఉన్నారు. పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే ధృడ సంకల్పంతో స్థానిక జిల్లా భూపాలపల్లి రాహుల్ శర్మ, జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్ ఇతర అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.



సాగర్ వనపర్తి, పీఆర్ఓ,
దేవాదాయ శాఖ మంత్రివర్యులు.

## నేటి నుంచే కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానమైన కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు సమయం ఆసన్నమైంది. కాళేశ్వర త్రివేణి సంగమ ప్రాంతంలో నేటి నుంచి భక్తుల సందడి మొదలు కానుంది. పుష్కరాలకు భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. నదిలో సరిపడా నీటి ప్రవాహం ఉండటంతో పుణ్యస్నానాలకు ఇబ్బంది లేదు. భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్లు కూడా సిద్ధం చేశారు. నేడు ప్రారంభమవనున్న సరస్వతి పుష్కరాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. త్రివేణి సంగమం వద్ద సరస్వతి ఘాట్ను ఆయన ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ పుష్కర ఘాట్ ప్రారంభం అనంతరం, కాళేశ్వర త్రివేణీ సంగమంలో సీఎం పుణ్యస్నానం ఆచరిస్తారు.మహా పుష్కరాలకు దేవాదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మే 15న ఉదయం 5 గంటల 44 నిమిషాలకు తొగుట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి పుష్కర స్నానాలు ఆరంభిస్తారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా మహాలక్ష్మి బస్సులు సరస్వతి పుష్కరాలకు తెలంగాణ ఆర్టీసీ కూడా సన్నద్ధమైంది. ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న ఈ పుష్కరాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా టీజీఎస్ఆర్టీసీ కూడా ప్రత్యేకంగా బస్సులు నడపాలని నిర్ణయించినట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సామాజిక మాధ్యమం ఎక్స్లో పోస్ట్ చేశారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని భావించి కాళేశ్వరంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేరవేయడానికి ఆర్టీసీ యాజమాన్యం అవసరమైన చర్యలు తీసుకుంటుంది. కరీంనగర్ జోన్లోని వివిధ డిపోల నుంచి బస్సులు నడిచేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

కరీంనగర్ రీజియన్ నుంచి కాళేశ్వరానికి ఈ నెల 15 నుంచి 26 వరకు రోజూ 50 అదనపు సర్వీసులు నడపనున్నారు. రద్దీ ఎక్కువగా ఉంటే మరిన్ని బస్సులను కూడా అందుబాటులో ఉండేలా ప్లాన్ చేశారు. సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అధికారులతో సమావేశం నిర్వహించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కరీంనగర్, మంథని, గోదావరిఖని డిపోల నుంచి ప్రత్యేకంగా అదనపు బస్సులు నడుపుతున్నాం. ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుంది. రద్దీకి అనుగుణంగా తగు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.

## చిర్యాల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య

- **కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న కీసర పోలీసులు**

కీసర, విశాలభారతి:



కీసర పోలీస్ స్టేషన్ చిర్యాల్ ప్రభుత్వ పాఠశాలలో బార్లపాటి వర్ధన్ (17) మైనర్ ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుతున్న పిల్లలు బాల్ తరగతి గదిలో పడడంతో ఫ్యాన్ కి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. సంఘటన స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై చుట్టుపక్కల వారిని అడిగితెలుసుకున్నారు.కీసర సి ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం చిర్యాల్ గ్రామానికి చెందిన బార్లపాటి వర్ధన్ గత సంవత్సరం 9వ తరగతి నుండి స్కూల్ మానేశాడు.2025 లో ఓపెన్ స్కూల్ లో 10 వ తరగతి పరీక్ష రాశాడు.విద్యుత్ శాఖలో ప్రయివేట్ ఉద్యోగిగా వర్ధన్ చిర్యాల్ లో కరెంట్ బిల్స్ కోటేవాడని ఆయన తెలిపారు. వర్ధన్ ఇంట్లో నుండి వెళ్ళి మూడు రోజులు అయిందని వారి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియలేదు సమగ్ర విచారణ చేసిన అనంతరం తెలుస్తుందని అన్నారు.పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న కీసర పోలీసులు.

## కూలిగా మారిన మాజీ ఎంపీ

నల్గొండ, విశాలభారతి:



నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న 1948 స్వాతంత్ర్య విద్యార్థి ఉద్యమకారుల జ్ఞాపకార్థంగా స్మారక స్థూప నిర్మాణానికి మాజీ ఎంపీ,ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు కూలీగా మారి కంకర సిమెంట్ ను నెత్తిపై మోస్తూ ,కూలీలతో కలిసి పని చేశారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర వచ్చిన అనంతరం తెలంగాణ నైజం పరిపాలన లో ఉండేది.ఈ తెలంగాణ కు స్వాతంత్ర్య రాకపోవడం వలన నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో 1948 ఆగస్టు 15 రోజున తొమ్మిదవ, పదవ తరగతులకు చెందిన పది మంది విద్యార్థులు జాతీయ జెండాను ఎగరవేసిన కారణంగా అప్పటి నిజాం నవాబ్ ప్రైవేట్ సైన్యమైన రజాకారులు జెండా ఎగరవేసిన వారిని ప్రభుత్వ పాఠశాలలో కాల్చి చంపారని అన్నారు. వారి జ్ఞాపకార్థం వి. హనుమంతరావు ఈ చరిత్రను తెలుసుకుని వారి స్మారకార్థం స్థూపాన్ని నిర్మించాలని ,మూడు సంవత్సరాలుగా ఆగస్టు 15వ తేదీన వల్లాల ప్రభుత్వ పాఠశాలకు వచ్చి వారికి నివాళులు అర్పిస్తున్నారు.స్మారక స్థూపాన్ని నిర్మించి రాబోయే తరాలకు వారి త్యాగాన్ని తెలియజేసేలా చేస్తానని తన స్వంత డబ్బులతో స్వాతంత్ర్య విద్యార్థి అమరవీరుల స్థూపాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. 1948 లో చనిపోయిన విద్యార్థుల స్మారక స్థూపా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను పరిశీలించి, ఇసుక కంకర సిమెంట్ తో బెడ్ వేయించడం జరిగింది. వి.హనుమంతరావు కంకర,సిమెంట్, ఇసుక తట్టలో వేసుకుని కూలీగా పని చేశారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా కాంగ్రెస్ నాయకులు ఎంఏ బాసిత్ ,పీసీసీ నాయకులు శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ లు ,మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబొయిన సుధాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగే నర్సింహా, మాజీ సర్పంచ్ లు ఇంతియాజ్, దండ అశోక్ రెడ్డి,కట్టంగూరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడి మృతి

- **తాటి చెట్లను కోయడానికి వెళ్లిన గీత కార్మికుడు మృతి**

పెద్ద అంబర్పేట్, విశాలభారతి:



రంగారెడ్డి జిల్లా,అబ్దుల్లాపూర్ మెట్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి గుంతపల్లి గ్రామనికి చెందిన అంతటి సంతోష్ తన వ్యవసాయ క్షేత్రం నందు ఉన్నటువంటి తాటి చెట్టు పై నుండి బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు, వివరాల్లోకి వెళితే అబ్దుల్లాపూర్మెట్ మండలం గుంతపల్లి గ్రామనికి చెందిన అంతటి సంతోష్ కుమార్ తండ్రి దాస్ 45 సంవత్సరాలు వృత్తిరీత్యా కల్లుగీత కార్మికుడని వారి గ్రామ పరిధిలో ఉన్నటువంటి బట్టి గడ్డ ప్రాంతంలో తాటి చెట్లు నరకడానికి బుధవారం ఉదయం నాలుగు గంటల 30 నిమిషాల నుండి 5 గంటల సమయంలో పని నిమిత్తం బయటికి వెళ్లినట్లు అతని పూర్తి అయిన తర్వాత అదే గ్రామానికి చెందిన కర్మేల యాదయ్య తండ్రి రామయ్య వయసు 50 సంవత్సరాలు వ్యవసాయ కూలి అంతటి సంతోష్ ను తన ఇంటి వద్ద దిగబెట్టినట్లు ఆ తర్వాత ఉదయం ఏడు గంటల సమయంలో తన సొంత వ్యవసాయ క్షేత్రం సర్వే నెంబరు 242లోని తాటి చెట్లను నరకడానికి వెళ్లడని, కానీ అతను ఉదయం 9 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో సంతోష్ భార్యకు అనుమానం వచ్చి తన భర్తకు ఫోన్ చేసిన ఫోను ఎత్తకపోవడం వలన తన కుమారుడు ముఖేష్ను వెతకడానికి తన వ్యవసాయ భూమి నందు పంపించినట్లు అతను అక్కడికి వెళ్లి తాటి చెట్టు పై ఉన్నటువంటి మోకు వేలాడుతూ కనిపించడం అదే చెట్టు కింద తన చెప్పులు ఉన్నాయని, అదే తాటి చెట్టు పక్కన ఒక పాత బావి ఉందని గమనించిన తన కుమారుడు ముఖేష్ బావిలోపల తొంగి చూడడంతో అతని తండ్రి బావిలో పడి మరణించి ఉన్నట్లు గమనించిన వెంటనే తన తల్లి ఉషా కి సమాచారం చేరవేయడంతో హుటా హుటిన తన వెంట గ్రామస్తులు అక్కడికి తీసుకొని వెళ్లడం జరిగిందని వెంటనే సమాచారాన్ని పోలీసులు అందజేయడం జరిగిందని తెలిపారు,తన భర్త సంతోష్ చనిపోవడానికి గల కారణమేంటో అంతుచికడం లేదంటూ తన భార్య అంతటి ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అశోక్ రెడ్డి తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

15.05.2025
గురువారం,
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily




## సాంబరాజు కుటుంబానికి జెఎస్ఆర్ తరుపున ఆహార సహాయం



**విశాలభారతి,భీమదేవరపల్లి :**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక వ్యక్తి సాంబరాజు కుటుంబానికి ప్రముఖ సామాజిక సేవకుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి తరపున 50 కిలోల బియ్యం అందజేయడం జరిగింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి ఇది కొంత ఉపశమనాన్ని కలిగించిందని స్థానికులు పేర్కొన్నారు. జెఎస్ఆర్ గత కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని, ప్రత్యేకించి ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని స్థానికులు తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు జెఎస్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# జగ్గారెడ్డి జోలికొస్తే ఊరుకోం

- **ఈటల చరిత్ర అందరికి తెలిసిందే**
- **కాంగ్రెస్ నాయకులు అరుణ్ గౌడ్,మవీన్ గౌడ్, చిన్న ముదిరాజ్**

**పటాన్ చెరు,విశాలభారతి**

మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ చరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని డిసిసి ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మవీన్ గౌడ్, డీసీసీ జనరల్ సెక్రటరీ చిన్న ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఓ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి విషయంలో అదేవిధంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమయంలో జరిగిన యుద్ధం వాతావరణంపై వివరించడం జరిగిందన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్రంగా విమర్శించడం జరిగిందని తెలిపారు. దానిని ఖండించిన తమ నాయకుడు జగ్గారెడ్డి పై కొంతమంది ఈటెల రాజేందర్ చెంచాలు అవగాహన లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదని చెప్పారు. జగ్గారెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేయడం వారి స్థాయికి తగదని హెచ్చరించారు. జగ్గారెడ్డి చేస్తున్న ప్రజాసేవ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ తెలుసన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలతో రాజకీయాల్లో వచ్చిన ఈటల రాజేందర్ పార్టీలు ఎందుకు మారడం జరిగిందో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అదే మాదిరిగా టిఆర్ఎస్ పార్టీలో ఆయనని కెసిఆర్ ఎందుకు సస్పెండ్ చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని వివరించారు. ఈ విషయం తమ నాయకుడు జగ్గారెడ్డి పై విమర్శలు చేస్తున్న చెంచాలకు తెలియదా అని ప్రశ్నించారు. తన అక్రమార్జనలను కాపాడుకోవడం కోసమే ఈటల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నిరుపేదల రైతుల భూములను కాజేసిన చరిత్ర ఈటెలదని తెలిపారు. బిజెపి పార్టీలో ఆయనకు సరైన గుర్తింపు లేకపోవడంతో తన ఉనికిని కాపాడడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మొదట తమ నేత జగ్గారెడ్డి పై విమర్శలు మొదట ఈటల చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. ఈటల కోట్లాది రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తమ నాయకుడు జగ్గారెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నాడని తెలిపారు. డబ్బుల కోసం, అధికారం కోసం కాదన్నారు. నిరుపేదల కోసం ఆయన జీవితాన్ని దారబోస్తున్నారని తెలిపారు. అప్పులు చేసి మరి ప్రజలకు సేవ చేస్తున్నారని సంగతి ప్రజలందరికీ తెలుసు అని తెలిపారు. అలాంటి నాయకుని పై అనవసరమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈటెల చెంచాలు చేసిన ఆరోపణలపై తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. మీ నాయకుడు ఈటల రాజేందర్ ను తీసుకొని వస్తే పటాన్ చెరులో అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జగ్గారెడ్డి పై ఆరోపణలు చేసిన రాజేందర్ చెంచాలకు రెండు రోజులు సమయం ఇస్తున్నామని, చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా సంగారెడ్డి ప్రజలకు సేవలు అందించిన జగ్గారెడ్డిని విమర్శించే ముందు మీ స్థాయిని ఒక్కసారి చూసుకోవాలని కోరారు. నాయకులు అక్కలి శ్రీనివాస్, జగన్, రామ్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.










# మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ కు అనుమతులు ఎక్కడ..?

- **అనుమతులు లేకున్న ఉన్నట్టుగా విస్తృత ప్రచారం**
- **లక్షల్లో ఫీజులు, కానరాని ఇన్ఫ్రాస్ట్రక్చర్**
- **భవనంలో కింద హోటల్, పైన ఫ్లోర్లో స్కూల్**
- **మామూళ్ల మత్తులో అధికారులు**
- **చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న తీరు**
- **జిల్లా డీఈవో తక్షణమే అనుమతిలేని స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలి**
- **భవిష్యత్తును కాపాడాలి**
- **బండ్లగూడ విద్యాశాఖ అధికారులపై త్వరలో వరుస కథనాలు**

**విశాలభారతి, హైదరాబాద్:**

నగరంలో అనుమతి లేని మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ ను ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని విద్యావేత్తలు కోరుతున్నారు. హైదరాబాదులోని బండ్లగూడలో ఆర్టీవో ఆఫీస్ వెనకాల నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ ఎలాంటి అనుమతి లేకుండా అడ్మిషన్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. అనుమతులు రాకముందే ప్రచారం, అడ్మిషన్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని, అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు లేకున్నా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థగా ప్రకటించుకుంటోంది. వీడియోలు, బ్రోచర్లు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారు.

**తనిఖీలు ఆఫీసులకే పరిమితం**

**ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ కోల్పోతున్న విద్యాశాఖ**

ప్రైవేట్ పాఠశాలల నియంత్రణపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ బండ్లగూడలోని మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ అనుమతులు లేని వాణిజ్య భవనాల్లో, హోటళ్ల పై అంతస్తుల్లోనూ నడుస్తున్నా, విద్యాశాఖ అధికారులు కార్యాలయాల నుండి బయటకి రాకుండా ఆఫీసు తనిఖీలకే పరిమితమవుతున్నారు. కేవలం ఫైళ్ల పని మీదే దృష్టి పెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నా కూడా కొన్ని చోట్ల అవినీతి పుంతల్లో మునిగిపోయిన అధికారుల వల్ల ఎటువంటి చర్యలు తీసుకోబడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**జీవో నెం.1 అమలుచేయని పాఠశాలలు**

**– భద్రతా ప్రమాణాలు లేవు, ఫీజుల దందా మాత్రం కొనసాగుతుంది**

విద్యా శాఖ విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 1 పూర్తిగా విస్మరించి, ఫైర్ సేఫ్టీ, ప్లే గ్రౌండ్స్ వంటి ప్రాథమిక వసతులేవీ లేకుండా, ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా, సీబీఎస్ఈ, ఎస్ఎస్సి, నీట్ ఫౌండేషన్, ఇస్లామిక్ ఎడ్యుకేషన్, గ్లోబల్ స్కూల్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు.బ్రోచర్లు, సోషల్ మీడియా, బహిరంగ ప్రచారం చేస్తూ, తల్లిదండ్రుల వద్ద నుంచి లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తూ ఉన్నారు. కానీ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటూ, విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**హోటల్పై స్కూల్ విద్యా ప్రమాణాలకు ఆటంకం?**

పాఠశాల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో హోటల్ నడుస్తుండగా, పై అంతస్తుల్లో మాస్టర్ మైండ్స్ గ్లోబల్ స్కూల్ ను నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలకు ఆటంకం కలిగించే ఈ విషయంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలు పిల్లలకు శిక్షణతో పాటు భద్రతను కూడా అందించాల్సిన అవసరం ఉండగా, అలాంటి వాతావరణానికి వ్యతిరేకంగా హోటల్ పై పాఠశాల నడపడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హోటల్లో వంట గదులు, గ్యాస్ సిలిండర్లు, అనుకోని ప్రమాదాలకు అవకాశం ఉండడం విద్యార్థులకు ప్రమాదకరం అని స్థానికులు చెబుతున్నారు.బండ్లగూడ జోన్ లో విద్యాశాఖ అధికారుల తీరు వ్యవహారంపై త్వరలో విశాల భారతి' లో వరుస కథనాలతో



# మహోనియ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

- **నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**
- **ఎమ్మెల్యే**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మన్నెగూడ లోనీ మహోనియా ఆసుపత్రిని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భాస్కర్ తో కలిసి ప్రారంభించారు. అనారోగ్యంతో ఉండి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వారికి తక్కువ ధరలకు నాణ్యమైన వైద్య సేవల్ని అందుబాటులోకి తెచ్చేలా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషమన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే ప్రజల ఆదరణ పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మహమ్మద్ ఖాజు , శివకుమార్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఓయూలో డా.పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

**విశాలభారతి, ఓయూ:**

తెలంగాణ రాష్ట్ర ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిజేఏసీ చైర్మన్ తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు? తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా. పిడమర్తి రవి జన్మదిన వేడుకలను మాదిగ విద్యార్థి జేఏసీ ఉస్మానియా యూనివర్సిటీ ఇన్చార్జ్ జోగు. గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఓయూలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమంలో రవి త్యాగం చాలా గొప్పదని అని బహుజన ఉద్యమాలు చేసిన గొప్ప నాయకుడని తన జీవితం మొత్తం బహుజన వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తి రవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో SSFరాష్ట్ర అధ్యక్షులు చాగంటి రాజేష్ . మాదిగ విద్యార్థి జేఏసీ కన్వీనర్ మీసాల మహేష్‌రాజు సతీష్‌శేఖర్ నాగరాజ్ వినోద్ గోవర్ధన్ నవీన్ సుధాకర్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై బీజేపీ ఎంపీ ఈటల చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి

- **ఓయూ విద్యార్థి నేతలు**

**విశాలభారతి,ఓయూ:**

సీఎం రేవంత్ రెడ్డిపై ఈటెల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఓయూ విద్యార్థి & యువజన నాయకులు గాదె వెంకట్, హరినాథ్ గోపాల్ దాస్, డా"జిల్లా పల్లి నాగేశ్వరరావు, దూడపాక సురేష్, కంపాటి వెంకట్ లు కోరారు. ఈటల రాజేందర్ తన హోదాను మరిచి సీనియార్టీని మరిచి తన స్థాయికి తగని రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాట్లాడినటువంటి మాటలు తన దిగజారుడుతనాన్ని నిరూపిస్తున్నాయి. రాజకీయాలలో ఎంతో కొంత హుందాగా మాట్లాడే వ్యక్తి, చిల్లర మల్లర మాటలు, అసభ్య పదజాలం, వాడరు అని పేరు ఉన్న మీరు రేవంత్ రెడ్డి పై మాట్లాడిన మాటలని సభ్య సమాజం కూడా హర్షించడం లేదన్నారు.తన స్వార్థం కోసం బిజెపి అధినాయకత్వం మెప్పుకోసం రేవంత్ రెడ్డి పై చిల్లర మల్లర మాటలు మాట్లాడితే అధ్యక్ష పదవి వస్తుందని భ్రమలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇలాంటి దిగజారుడు మాటల వల్ల అధ్యక్ష పదవి కాదు కదా రాజకీయాల్లో అట్టడుగు స్థాయికి పోయే విధంగా రాజేందర్ ప్రవర్తన ఉందని తెలిపారు. మరోసారి సీఎం రేవంత్ రెడ్డి పై గాని, కాంగ్రెస్ నాయకత్వంపై గాని, కాంగ్రెస్ శ్రేణులపై గాని ఇదేవిధంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.



# ఆపదలో అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులు

- **మృతుని కుటుంబానికి రూ. 1 లక్ష 7 వేలు ఆర్థిక సాయం**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఆపదలో ఉన్న క్లాస్ మెట్ కుటుంబానికి అండగా నిలిచారు తోటి స్నేహితులు. ఆనందంలోనే కాదు ఆపదలో కూడా తామున్నామంటూ భరోసా కల్పించారు. వివరాల్లోకెళ్తే యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దండుగులతిరుమలేష్ ఈనెల 2న ఔటర్ రింగ్ రోడ్డు పైన జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. నల్లవెల్లి ప్రభుత్వ పాఠశాలలో 2010 లో పదవ తరగతి పూర్తి చేసుకున్న ఆనాటి మిత్రులు అండగా నిలిచారు. వారి తరుపున రూ. లక్ష 7 వేలు తిరుమలేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కాగా తిరుమలేష్ కి ఇద్దరు సంతానం , తమ స్నేహితుడు తిరుమలేష్ అకాల మరణం వారికి తీరని లోటని, ఒక మంచి మిత్రుని కోల్పోయామని బ్యాచ్ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తిరుమలేష్ తో పాటు చదువుకున్న స్నేహితులే కాకుండా చదువు చెప్పిన ఉపాధ్యాయులు కూడా తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ సహకరించిన తోటి మిత్రులకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పుస్తక ఆవిష్కరణ చేసిన ఓయూ వీసీ

**విశాలభారతి,ఓయూ:**

డాక్టర్ ప్రవీణ్ కుమార్ యాట మరియు మాజీ ఓయూ వీసీ ప్రొ. సత్యనారాయణ రాసినటువంటిపరిశోధన పుస్తకం 'రుతునియన్ పాలిపిరిడేల్ మెటల్ బేస్డ్ యాంటీ క్యాన్సర్ డ్రగ్స్' అనే పరిశోధక పుస్తకాన్ని సోమవారం ఓయూ వీసీ ప్రొ. కుమార్,రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్ ల చేతుల మీదుగా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొ. కుమార్ మలుగురం రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్, డిస్టిక్ కాలేజ్ డైరెక్టర్ ప్రొ. రాజేందర్ నాయక్ , ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డిలు తదితరులు డాక్టర్ యట ప్రవీణ్ కుమార్ ను, అభినందించారు.ఈ పుస్తకం అమెజాన్ ఫ్లిప్కార్ట్లలో ఆన్లైన్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.



# అనారోగ్యంతో భూపతి ధనమ్మ మృతి

- **నివాళులు అర్పించిన పలువురు నాయకులు**

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట మండల పరిధిలో ని బాలెంల గ్రామానికి చెందిన భూపతి శివ మాత్రు మూర్తి భూపతి ధనమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బుధవారం పలువురు నాయకులు ఆమె మృత దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళి అర్పించి అ కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఎన్ ఆర్ ఐ సంగాని రజిని కాంత్, మాజీ జడ్పీటీసి జీడి భిక్షం, బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చేగొని సంతోష్, ఆరేగూడెం మాజీ సర్పంచ్ పులగం రాఘవ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మామిడి తిరుమలేశ్, గ్రామ వార్డు మెంబర్ శివరాత్రి యల్లయ్య, మండల యూత్ నాయకులు ఎరుకల సాయి ఉన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

15.05.2025
గురువారం,
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# రైతుల ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చూడాలి

- మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి.
- మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచాలి.
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, విశాలభారతి:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మిల్లర్లు మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి వేగవంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి కలెక్టర్ వేబిక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం కొనుగోలు సెంటర్ నుండి ఎగుమతి అయి వచ్చిన లారీలను వెంటనే మిల్లర్లు మిల్లుల వద్ద వేగంగా దిగుమతి చేసుకోనెలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మిల్లర్లు తప్పనిసరిగా హమాలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు వచ్చిన వెంటనే ధాన్యం ఎగుమతి త్వరగా అయ్యేలా చూడాలని సెంటర్ ఇన్చార్జిలను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని,త్వరగా ధాన్యం ఎగుమతి దిగుమతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, వారం రోజులలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వెబ్ ఎక్స్ వీడియో సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డి సి ఓ పద్మ, డిఎం సివిల్ సప్లై ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్ నాయక్, డిఎం మార్కెటింగ్ శర్మ, అధికారులు అన్ని మండలాల కొనుగోలు కేంద్ర సెంటర్ ల ఇన్చార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని రకాల కార్లు రిపేర్ చేయబడును

**విశాలభారతి,భీమదేవరపల్లి :**
స్థానికంగా ముల్కనూర్ లో ఎస్.వి.ఎస్ నూతన కార్ సర్వీస్ కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రంలో అన్ని రకాల కార్లకు మరమ్మతులు చేయబడతాయని నిర్వాహకుడు శ్రీపతి శ్రీనివాస్ తెలిపారు. ఇంజిన్ ట్యూనింగ్, బ్రేక్ రిపేర్, ఏసీ సర్వీస్, బాడీ పెయింటింగ్ సహా ఇతర అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనుభవజ్ఞులైన మెకానిక్, ఆధునిక పరికరాలతో నిపుణుల సర్వీసు అందిస్తున్నామని వారు తెలిపారు. ఖచ్చితమైన పని, నమ్మకమైన సేవతో కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జిల్లాలో భారీగా కానిస్టేబుల్ల బదిలీ

- కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్
- పోలీస్ యూనిఫాం అనేది సమాజంలో ఒక గుర్తింపు
- ఉత్తమ సేవలు అందించడం కోసం కృషి చేయాలి
- ప్రజల రక్షణ మన ప్రధానమైన గురుతర బాధ్యత



**సూర్యాపేట,విశాలభారతి:**
జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు పని చేస్తూ 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న 64 మంది కానిస్టేబుల్ లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరిన చోటుకు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ బదిలీ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి మాట్లాడుతూ సమాజంలో పోలీస్ యూనిఫాం కు సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉన్నదని, ప్రజల దృష్టి మనపై ఉంటుందని, ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. సమాజ రక్షణ, పౌరుల రక్షణ మన ప్రధాన విధి, గురుతరమైన బాధ్యతగా భావించాల న్నారు. సూర్యాపేట జిల్లా పోలీస్ సిబ్బంది కష్టపడి పని చేస్తారనే పేరు ఉన్నదని, ఆ పేరును, పోలీసు శాఖ గౌరవాన్ని, యూనిఫాం గౌరవాన్ని కాపాడుతూ కష్టపడి పని చేయాలని సూచించారు. తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలన్నారు. మంచి ఆహార అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం, యోగ చేయడం లాంటివి చేయాలన్నారు. అనంతరం అదనపు ఎస్పి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పి మీరు కోరుకున్న పోలీస్ స్టేషన్ కు పోస్టింగ్ ఇచ్చారని, అధికారుల అంచనాలకు అనుగుణంగా పని చేయాలని అన్నారు. పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ మాట్లాడుతూ సిబ్బందికి అందరికీ అనుకూలంగా బదిలీ చేశారని ఎస్పికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, ఏ ఆర్ డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగబుషణ రావు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్, ఆర్ ఎస్ ఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.

# మూసీ సుందరీకరణ షురూ అయ్యేనా!



పాలకుల పలుకుల్లో ఉన్న గాఢత చేతల్లో ఉండదు. గతమంతా గంగల గలగల పారిస్తాం అని పలికిన నోర్లు నిస్తేజంగా ఉండిపోయినవి. అదే మాదిరి నేటి పాలకుల తీరు ఉన్నది. థేమ్స్ నదిలా ఆధునిక హంగులతో నవీనికరణ చేపడతాం అని మాటిచ్చిన ముఖ్యమంత్రివర్యులు మాట మరిచి పోయినారా? మూసీ ప్రక్షాళన కోసం కేటాయించిన బడ్జెట్ పేపర్లకే పరిమితం అయిందా? ఎందుకు ఈ జాప్యం. మూసీ హైదరాబాద్ కే కాదు గుంటూరు జిల్లా వరకు తన ప్రవాహాన్ని కొనసాగిస్తూ వ్యవసాయానికి ఆదరువుగా ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ నదిని పాలకుల నిర్లక్ష్యానికి గురై మురికి నీళ్ళ నదిగా మారింది. పరిశ్రమల వ్యర్థాల ఫలితంగా విషపు మయంగా మారి తాగు సాగు నీరుగా ఉన్న ఈ నది విషపు జలంగా మారింది. ఫలితమే నల్లగొండ ఫ్లోరైడ్ భూతం. ఎన్ని కుటుంబాలు కకావికలం అవుతున్నవి. ఎన్ని పశుపక్ష్యాదులు తనువు చాలిస్తున్నవి. వ్యవసాయం నడ్డి విరిగి పడి ఉన్నది. శుద్ధి చేసే యంత్రాలు ఉన్నవి. యంత్రాంగం ఉన్నది. విదేశాల ట్రిప్పులు వెళ్లి అక్కడి సాంకేతికత నేర్చుకొని తెలుసుకొని వచ్చిన మంత్రులు అధికారాలు ఉన్నారు. మరెందుకు ఇంకా కాలయాపన? మూసీ సుందరికరణ మొదలుపెడితే పరిశ్రమల యజమానుల నుండి ఒత్తిడులు ఉంటాయ? సహజంగా నీటికి రంగు ఉండదు అని చదువుకున్నాం. కానీ మూసి లో ప్రవహించే నీరు తెల్లగా నురగలు గక్కుతూ ఉంటుంది. అది మనం ఎక్కడో బట్టలు ఉతికితే వచ్చిన సబ్బు నురగ అనుకుంటాం కానీ అది తీక్షణంగా పరిశీలిస్తే అది విషం అని తెలియదు.ఎన్నికల ముందు ఎన్నో ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం తక్షణమే మూసీ సుందరీకరణ మొదలుపెట్టాలి. హైదరాబాదులో జలకళ ఉట్టి పడేలా చర్యలు తీసుకోవాలి.పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలను మూసి లోకి పంపకుండా యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు షురూ చేయాలి. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజల జీవనస్తితిగతి మీద చావుదెబ్బ కొడుతున్న అన్ని రకాల దుష్ప్రభావాలను అరికట్టాలి. ప్రజా శ్రేయస్సే ముఖ్యంగా పని చేయాలి.



ప్రొఫెసర్ వెంకట్ దాస్



డా. పోటు నారాయణ




# హయత్ నగర్ డివిజన్ ను అభివృద్ధి లక్ష్యం

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్లోని మీదాని కాలనీలో జరుగుతున్న నూతన రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాచురల్ స్లాప్ కు అనుకూలంగా సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని, గత నాలుగు సంవత్సరాలుగా హయత్ నగర్ డివిజన్ ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, రానున్న రోజుల్లో కూడా హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి చేయడమే తన యొక్క ముఖ్య లక్షణం అని కార్పొరేటర్ తెలపడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో డి ఇ దామోదర్ , ఏ ఇ మేము నాయక్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ , మీదాని కాలనీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, మీదాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరమైన మూల మలుపు

- కుంట్లూర్ నుండి తట్టిఅన్నారం వెళ్లే రోడ్డు మార్గంలో
- మూలమలుపు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి
- ప్రయాణికుల విజ్ఞప్తి



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**
అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కుంట్లూర్ నుండి తట్టి అన్నారం వెళ్లే రహదారిలో మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉందని స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి రోడ్డు మూలమలుపు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఒకవైపు నుండి వచ్చే వాహనాలు ఇంకోవైపు కనిపించకపోవడం ఈ మూలమనపు నందు పలుమార్లు వాహనాలు ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలను కోల్పోవడం, వాహనాలు కింద పడి వాహనాలు డ్యామేజీలు అవ్వడం జరుగుతుందని ఇలాంటి ప్రమాదకర మైన మూలమలుపు నందు హెచ్చరిక సూచికలు అయినా ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చూడాలని కోరారు. అయినప్పటికీ అధికారులు తమకేం పట్టనట్లు చోద్యం చూస్తున్నారు తప్ప ప్రమాదకరంగా ఉన్నటువంటి ఈ మూలమలుపు నందు ఎలాంటి హెచ్చరిక బోర్డులను కానీ ప్రమాద సూచికలు గాని ఏర్పాటు చేయకపోవడం చాలా విడ్డూరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు.




# మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

- దళిత వర్గాల ఆత్మగౌరవ చిహ్నం పిడమర్తి రవి
- మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు

**మణుగూరు, విశాలభారతి:**
మూడు దశాబ్దాల ఎస్సి వర్గీకరణ పోరాటంలో 12శాతం రిజర్వేషన్లు కోసం మొదటి నుంచి పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించి జాతికి అభివృద్ధి పలాలను అందించి, దళిత వర్గాలకు డాక్టర్. పిడమర్తి రవి ఆత్మగౌరవ చిహ్నం నిలిసారని, మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సారథి, ఉస్మానియా యూనివర్సిటీ కెరటం దళిత ముద్దుబిడ్డ, రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మాదిగ జేఏసి వ్యవస్థాపకులు డాక్టర్. పిడమర్తి రవి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని బాపూజీ నగర్ లో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన తిరుమల రావు కేక్ కట్ చేసిడాక్టర్ పిడమర్తి రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు గుండ్ల వెంకటేశ్వర రావు(జీవి ), డిసిసిబి మాజీ డైరెక్టర్ మాదిగ సంఘం జిల్లా నాయకులు బోయిల్ల రమణయ్య, మాదిగ జేఏసీ మండల అధ్యక్షులు కన్నెగంటి వేణు, నాయకులు చాపల మడుగు ప్రవీణ్ కుమార్,గుగ్గిళ్ళ మధు, వేంపల్లి సతీష్, సిద్దెల కృష్ణ, మోదుగు తిరుపతి, ఉసికెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి జాతర

- ఘంగా శకుతోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం

**నర్సింహులపేట, విశాలభారతి:**
మండల కేంద్రంలోని కపిలగిరిపై వెలిసిన శ్రీ యోగనంద లక్ష్మి నర్సింహస్వామి జాతర ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. రథోత్సవాన్ని నిర్వహించి, స్వామి వారి ప్రతిమలను రథంపై ఉంచి ఆలయ పరిసరాలలో ఊరేగించారు. వివిధ మండలాల నుండి అధిక సంఖ్యలో వచ్చిన శకుతోత్సవం (బండ్లు) ఊరేగింపుగా శ్రీ యోగనంద లక్ష్మి నర్సింహస్వామి వారి చుట్టూ తిరుగుతూ దర్శనమిచ్చాయి. జాతరను వీక్షించడానికి తండోపతండాలుగా, జిల్లాలోని వివిధ మండలాల భక్తులు, సూర్యాపేట, నల్లగొండ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి భక్తజనం స్వామిని దర్శించుకున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసు అధికారులు సిబ్బందుల సహకారంతో శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు గౌతంరెడ్డి, సేవా సమితి సభ్యులు హనుమండ్ల వెంకటరెడ్డి, కర్ణాకర్ రెడ్డి, కిషోర్ కుమార్, బండి రమేష్, ప్రేమ్ కుమార్, యాకూబ్ రెడ్డి, శేషు కుమార్, నరేష్, ఉపేందర్, యాకయ్య, వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు, తదితరులు పాల్గొన్నారు.




# మంచినీటి సమస్యను పరిష్కరించాలి

- డిఫెన్స్ కాలనీ లోని భూగర్భ డ్రైనేజీ మంచి నిట్టి పైప్ లైన్ను పరిశీలన
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి,జలమండలి అధికారులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్ లోని డిఫెన్స్ కాలనీ లో బుధవారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , జలమండలి అధికారులతో కలిసి కాలనీలో ఉన్నటువంటి భూగర్భ డ్రైనేజి, మంచినీటి పైప్ లైన్ సదుపాయాలను పరిశీలించి, కాలనీవాసుల సమస్యలను సంబంధిత జలమండలి మేనేజర్ కి వివరించడం జరిగింది. డిఫెన్స్ కాలనీలో ఉన్నటువంటి మంచినీటి సమస్యను పరిష్కరించి, మరలా ఇలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ రాజు , వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ , సూపెర్వైసోర్ బాలు తో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# శైలజ ఈశ్వరకు ఆంగ్లంలో పీహెచ్డీ



పటాన్ చెరు,విశాలభారతి

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) ఆంగ్లం, ఇతర భాషల విభాగం పరిశోధక విద్యార్థిని శైలజ ఈశ్వర డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'అనితారావు బాదామి, ఉమా పరమేశ్వరన్ యొక్క ఎంపిక చేసిన నవలల్లో డయాస్పోరిక్ థీమ్ల అధ్యయనం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న జీఎస్ హెచ్ఎస్ ఆంగ్లం, ఇతర భాషల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. జోసెఫ్ జయకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ ఈశ్వర సిద్ధాంత వ్యాసం ప్రఖ్యాత దక్షిణాసియాకెనడియన్ రచయితల రచనలలో డయాస్పోరా యొక్క సూక్ష్మ సాంస్కృతిక, మానసిక కోణాలను పరిశీలిస్తుందని తెలిపారు. ఈ అధ్యయనం స్థానభ్రంశం, గుర్తింపు, సాంస్కృతిక సంకరత, నోస్టాల్జియా, అంతర్‌తరాల సంఘర్షణ వంటి ఇతివృత్తాలతో విమర్శనాత్మకంగా నిమగ్నమై, వలస రాజ్యాల అనంతర, డయాస్పోరిక్ సైద్ధాంతిక చట్రాల ద్వారా తాజా అంతర్దృష్టులను అందిస్తుందన్నారు.డాక్టర్ శైలజ వైవా వోస్ పరీక్షను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి. మురళీ మనోహర్ సమక్షంలో నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ శైలజ ఈశ్వర సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన ఆధారిత ఆవిష్కరణలకు మద్దతు ఇస్తూ, పరిశోధక విద్యార్థులు తమ రంగాలను అన్వేషించడానికి, కొత్త వాటిని సృష్టించడానికి, అర్థవంతంగా సహకరించడానికి ఒక శక్తివంతమైన వాతావరణాన్ని గీతం పెంపొందిస్తోందని తెలియజేశారు.



## అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి:

పటాన్ చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రాజగోపురం కలశ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని, దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్ప నగేష్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవ్తుంది

- జూన్ 2 లేదా డిసెంబర్ 9 తర్వాత విలీనం
- రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారు
- బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



విశాలభారతి,స్టేట్ బ్యూరో:


బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందంటూ సంచలన కామెంట్స్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారన్నారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కాబోతోందన్నారు. జూన్ 2 లేదా డిసెంబర్ 9 తర్వాత విలీనం పక్కా అని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో పనిచేస్తారన్న మాజీ మంత్రి హరీష్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయమంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే అంటూ చాలా సార్లు బీజేపీ ఆరోపణలు చేసింది. బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య అంతర్గత ఒప్పందం ఉందంటూ బీఆర్ఎస్ పార్టీ కూడా ఆరోపణలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కొంత బలాన్ని చేకూర్చినట్లైంది. గత కొద్ది రోజులుగా తెలంగాణలో పాలన స్తంభించింది. అనుకున్న స్థాయిలో వెల్ఫేర్ స్కీమ్స్ ముందుకు తీసుకువెళ్లడం లేదు. తెలంగాణ అప్పుల కుప్పగా మారిపోయిందని, తెలంగాణలో పూర్తి స్థాయి వెల్ఫేర్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకుపోయే పరిస్థితి లేదని, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని, ప్రభుత్వాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లాల్సిందిగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలను విశ్లేషించుకుని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తోంది.తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి పాలించే దమ్ము ధైర్యం లేనప్పుడు వదిలేస్తే తాము అధికారంలోకి వస్తామంటూ సీఎం రేవంత్ వ్యాఖ్యలకు మాజీ మంత్రి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు కూడా. ఈ నేపథ్యంలో ఇకపై తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో అధికారంలోకి రాబోతోందని, ఈ మేరకు విలీనం చేయాలని బీఆర్ఎస్ నాయకత్వం అంతా కూడా డిసైడ్ అయ్యిందని, అందుకు సంబంధించిన తేదీలు కూడా ఖరారైందంటూ బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి.



# టిడిపి సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ

నారాయణపేట, విశాలభారతి:

జిల్లా కేంద్రంలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను బుధవారం ఆ పార్టీ నాయకులు గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో బిసి కాలనీలో కార్యకర్తలకు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ ఆడహాక్ కమిటీ సభ్యులు రాములు యాదవ్,రాష్ట్ర సీనియర్ నాయకులు ఓంప్రకాష్ ముదిరాజ్ ,గోపాల్ యాదవ్ లు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు ఈ గుర్తింపు కార్డ్ రెండు సంవత్సరాలు వర్తిస్తుందని సభ్యత్వం పొందిన కార్యకర్త ఆకస్మికంగా యాక్సీడెంట్ లో మరణించినవారికి ఐదు లక్షల రూపాయలు పార్టీ ఆధ్వర్యంలో ప్రమాద బీమా అందించబడునని,నిరుపేద కార్యకర్తల పిల్లలకు ఉచిత విద్యకి అయ్యే ఖర్చులను పార్టీ భరిస్తుందని అన్నారు. నియోజకవర్గ, మండల,పట్టణ కమిటీలను త్వరలో ఎన్నుకుని తెలంగాణలో రాబోయే మున్సిపల్, గ్రామ పంచాయతి ఎన్నికల్లో టిడిపి జెండా ఆవిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో యాబన్న చౌదరి,వద్ది నారాయణ,మజర్ కమలమ్మ,ఉసెనప్ప,చిన్న యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# రాగల మూడు రోజులు వానలే వానలు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

రాగల మూడు రోజులు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధవారం కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగం కలిగిన ఈదురుగాలులు, వడగళ్ల వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురు, శుక్రవారాలు పలు జిల్లాలలో ఉరుములు మెరుపులు గంటకు 5060 కి.మీ వేగం కలిగిన ఈదురుగాలతో కూడిన వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రాగల మూడు నాలుగు రోజులలో నైరుతి రుతుపవనాలు మరింత పురోగమించి దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలు, పూర్తి అండమాన్ నికోబార్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతం, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలలోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలిపింది.



# కోహెడ కబ్జా స్థలాన్ని సందర్శించిన హైడ్రా కమిషనర్

రంగారెడ్డి, విశాలభారతి

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ కోహెడలో రాజాజీ నగర్‌లో తప్పుడు పత్రాలతో లేఅవుట్ వేసి ఆక్రమణలకు పాల్పడిన సమ్మిరెడ్డి బాల్ రెడ్డిపై కేసు నమోదు చేయనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానికులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి ఆక్రమణలను, రహదారులకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించింది. అయినా సరే మరోసారి సమ్మిరెడ్డి నిర్మాణాలు చేపట్టడంతో ప్లాట్ యజమానులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో సమ్మిరెడ్డి యజమానులపై దాడి చేశారనే విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోహెడ్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.రాజాజీ నగర లేఅవుట్ ప్రకారం రహదారులు, పార్కులను కబ్జాల చెర నుంచి విడిపిస్తామని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాటు యజమానులపై మారణాయుధాలతో దాడి చేస్తే ఎందుకు కేసు పెట్టలేదని సీఐని నిలదీశారు.




# అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

తుంగతుర్తి, విశాలాభారతి:

తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మండల తాసిల్దార్ దయానందంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు తడకమళ్ళ రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు పెళ్లిలు, శుభకార్యాలు, సభలు , సమావేశాలు పెట్టుకోవడానికి ఉపయోగకరంగా ఉంటదని కెసిఆర్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక కోటి రూపాయలు నిర్మించిన అంబేద్కర్ భవనని నిర్మించాలని తెలిపారు. ప్రస్తుత తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు గెలిచిన నెల రోజులకే ఆయన పేరుతో శిలాఫలకం పెట్టుకొని ఆ భవనాన్ని ప్రారంభించి గాలికి వదిలేసారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవనానికి విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయం, ప్రహరి గోడ నిర్మించి వెంటనే వినియోగంలోకి కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేష్ బొజ్జ సాయికిరణ్ బొంకూరి మధు తడకమళ్ళ మల్లికార్జున్, బోయిని కొమరయ్య, పోతరాజు మహేష్, ఏపూరి మహేష్, కొండగడుపుల నాగరాజు తదితరులు పాల్గొన్నరు.

# అర్హులకు మాత్రమే ఇంద్రమ్మ ఇల్లు ఇవ్వాలి

- కడారి కల్పన పట్టణ అధ్యక్షులు



చౌటుప్పల్, విశాలభారతి:

పట్టణ కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలను ఇచ్చి, ఆ ఇచ్చినటువంటి హామీలలో ఒకటి ఇందిరమ్మ ఇండ్లు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన కింద చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20 వార్డులలో వార్డుల వారీగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఒక్కొక్క వార్డుల్లో సుమారుగా 200 దరఖాస్తులు ప్రజలు ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పుడు ప్రజలు పెట్టిన దరఖాస్తులను స్వీకరించకుండా కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన వాళ్ళను లబ్ధిదారులుగా ప్రకటించినట్లుగా మాకు అనుమానంగా వుంది.కావున చౌటుప్పల మున్సిపల్ కమిషనర్ కి ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి హార్హులైన లబ్ధిదారులని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వవలసింది గా భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. లేనిపక్షంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించే వరకు భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు చినుకుని మలేష్ యాదవ్,జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కట్ట కృష్ణ,ముత్యాల భూపాల్ రెడ్డి ఉడుగు వెంకటేశం గౌడ్, వనం ధనంజయ,కడారి ఐలయ్య యాదవ్,అమృతం దశరథ,ఉడుగు శ్రీశైలం గౌడ్,కంచర్ల వెంకట్ రెడ్డి,వరగండి భాను ప్రకాష్,వంగాల రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

గురువారం,
15.05.2025
హైదరాబాద్



cinema updates

# విజయ్ కింగ్‌డమ్ విడుదల వాయిదా



విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ డ్రామా మూవీ కింగ్‌డమ్. ఈ మూవీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్‌ని మేకర్స్ అందించారు. ఈ మూవీ రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం ఈ మూవీ మే 30న విడుదల కావాల్సింది. ఈ మూవీని జులై 4న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. కింగ్‌డమ్ మూవీని మే 30న విడుదల చేయాలని ఎంతో ప్రయత్నించామని.. కానీ, ఇటీవల దేశంలో ఊహించని ఘటనలు జరిగాయని పేర్కొంది. దేశంలోని వాతావరణం కారణంగా, ప్రమోషన్‌లు కష్టంగా మారాయని.. ఈవెంట్స్ నిర్వహించడం సరికాదని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జులై 4న మూవీని విడుదల చేస్తామని సితార ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. మూవీ ఆలస్యంగా వచ్చినా అభిమానుల ప్రేక్షకుల అంచనాలకు తగ్గకుండా ఉంటుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే విడుదలైన మూవీకి స్పందించిన స్పెషల్ వీడియోకు మంచి స్పందన వచ్చింది. దాంతో మూవీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు.

# ఆ దేశం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టొద్దన్న నిఖిల్



భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో టర్కీ(తుర్కియో) పాక్‌కు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాయ్ కాట్ టర్కీ అనే క్యాంపెయిన్ కూడా రన్ అవుతోంది కొంతమంది పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్‌స్‌ను దిగుమతి చేసుకోవడం మానేశారు. మరోవైపు టర్కీలో భారతీయ సినీ నిర్మాతలు షూటింగ్స్ పెట్టుకోవద్దని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (FWICE) అన్ని భారతీయ చిత్ర నిర్మాతలను కోరింది. దీంతో సినిమా షూటింగ్స్ అక్కడ జరగని పక్షంలో ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.ఇక పలువురు ప్రముఖులు కూడా టర్కీపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హీరో నిఖిల్ కూడా తీవ్రంగా స్పందించాడు. ఓ నెటిజన్ సోషల్ మీడియాలో టర్కీ దేశ అధ్యక్షుడి వీడియోను పోస్ట్ చేయగా, అందులో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మాట్లాడుతూ..ఏదేమైనా మేం పాకిస్థాన్‌నే సపోర్ట్ చేస్తాం. ఆ దేశంతోనే కలిసి ముందుకు వెళ్తాం అంటూ ప్రకటించాడు. ఆ నెటిజన్ పోస్ట్‌ను రీ ట్వీట్ చేసిన నిఖిల్.. 'ఇప్పుడు చెప్పండి ఆ టర్కీ దేశం వెళ్తారా. మన వాళ్లు చాలా మంది ఆ దేశం వెళ్లి అక్కడ భారీగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు. అలాంటి దేశం కోసం మనం డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఆ దేశం వస్తువులు కూడా మనం వాడొద్దు' అంటూ రాసుకొచ్చాడు నిఖిల్. ప్రస్తుతం నిఖిల్ ట్వీట్‌ని కూడా కొందరు వైరల్ చేస్తున్నారు.



# అలా చేస్తే నాకు నచ్చదు

హీరోయిన్ ప్రీతి జింటా తెలుగులో 'రాజకుమరుడు' చిత్రంలో నటించి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఆ తర్వాత టాలీవుడ్ స్టార్స్‌తో పాటు బాలీవుడ్ బడా హీరోలతోనూ నటించి మెప్పించింది. తెలుగు, హిందీ భాషల్లోనే కాకుండా పంజాబీ, ఇంగ్లీష్ వంటి చిత్రాల్లోనూ నటించింది. ఇక ఇటీవల ప్రీతి జింటా 'లాహోర్' మూవీతో ప్రేక్షకులను అలరించింది. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది. అలాగే టైమ్ ఉన్నప్పుడల్లా అభిమానులతో చిట్ చాట్ చేస్తోంది. తాజాగా, ప్రీతి జింటా ట్విట్టర్ ద్వారా నెటిజన్లతో ముచ్చటించింది. ఇందులో భాగంగా ఫొటోగ్రాఫర్లకు వార్నింగ్ ఇచ్చింది. ఓ నెటిజన్ 'మీ గురించి తెలియని విషయం ఒకటి చెప్పండి' అని అడగ్గా.. దానికి ప్రీతి స్పందిస్తూ.. "ఆలయాలలో, బాత్రూంలో, భద్రతా తనిఖీల సమయంలో ఫొటోలు తీస్తే నాకు కోపం వస్తుంది. ఈ సమయాలలో తప్ప మిగతా సమయంలో ఫొటో అడిగిన, నాతో దిగిన కూడా నాకు ఎలాంటి ప్రాబ్లం లేదు. ముఖ్యంగా నా పిల్లల ఫొటోలు తీస్తే నాలోని కాళి బయటకు వస్తుంది. నేను ఎంతో సరదా మనిషిని. కానీ నా అనుమతి లేకుండా వీడియోలు తీయొద్దు. చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఏదైనా నేరుగా నన్ను అడగండి. దయచేసి నా పిల్లలను వదిలేయండి" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇక అది చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.



# నా కల నెరవేరింది

హీరోయిన్ షాలిని పాండే 'అర్జున్ రెడ్డి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'మహానటి, ఇద్దరి లోకం ఒక్కటే, 118 నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. గత ఏడాది 'మహారాజ్' సినిమాతో ప్రేక్షకులను అలరించింది. ఇక అప్పటి షాలిని అవకాశాలు రాకపోవడంతో ఖాళీగా ఉంటుంది. సమయం దొరికినప్పుడల్లా సోషల్ మీడియాలో తన ఫొటోలు షేర్ చేస్తోంది. తాజాగా, షాలిని పాండే తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. "మూడు సంవత్సరాల క్రితం, జయేష్ భాయ్ జోర్దార్ హిందీ చిత్ర పరిశ్రమలోకి నా మొదటి అడుగు. చాలా సంవత్సరాలుగా నేను మోస్తున్న కల నెరవేరింది. యష్ రాజ్ మాయాజాలం, రణవీర్ సింగ్ అద్భుతమైన ప్రతిభ, ఆది సర్ పూర్తి విశ్వాసం, నా అంతర్ దృష్టిని ఎల్లప్పుడూ నమ్మే నా అద్భుతమైన దర్శకుడు దివ్యతో ఇది నిజమైంది. నేను భయపడ్డాను, కళ్లు విశాలంగా ఉన్నాయి. వారు నన్ను ఎదగడానికి, ఎగరడానికి అనుమతించారు. నన్ను ఒక కేఫ్ లో చూసి ప్రతిదీ మార్చినందుకు షనూస్ శర్మకి ధన్యవాదాలు. నా చేయి పట్టుకున్న బృందానికి, నా హృదయాన్ని పట్టుకున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు! జయేష్‌భాయ్ మొత్తం బృందానికి ధన్యవాదాలు" అని రాసుకొచ్చింది. అలాగే 'జయేషాబాయ్ జోర్దార్' సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఫొటోలను షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు లవ్ ఎమోజీలు షేర్ చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.